# జోరుగా చేరికలు

- దుబ్బాక ప్రజలంతా బీఆర్ఎస్ వెంటే
- క్యాడర్‌లేని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు
- మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి
- ఎంపీ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు



ఎనగుర్తి కాంగ్రెస్, బీజేపీ యువజన నాయకులకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, అక్టోబర్ 17 : దుబ్బాక ప్రజలంతా సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వెంటే ఉన్నారని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కనమరుగయ్యాయని మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం దుబ్బాక మండలం పోతారంలోని తన నివాసంలో అక్బర్‌పేట–భూంపల్లి మండలం ఎనగుర్తి గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్‌ల యువజన నాయకులు సుమారు 60మంది ఎంపీ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరితో పాటు దుబ్బాక మండలం పద్మశాలీగడ్డకు చెందిన రెడ్డి సంఘం నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ అన్నారు. దేశంలో ఎక్కడాలేని అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోతో ప్రతిపక్షాలకు దిమ్మ తిరిగిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రజా విశ్వాసం పూర్తిగా కోల్పోయిందన్నారు. ఎన్నికల సమయంలో వచ్చే పార్టీలను నమ్మవద్దన్నారు. బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌ను గ్రామాల్లో నిలదీయాలని సూచించారు. నిరుద్యోగ యువతకు భృతి, దుబ్బాక చేనేతలకు టెక్స్‌టైల్ పార్కుతో ఉపాధి, రైతులకు జోడేండ్లు నాగలి, దుబ్బాకకు రైలు అంటూ ఎన్నో హామీలిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఓట్లకోసం ఎమ్మెల్యే రఘునందన్‌ను దుబ్బాక యువత, రైతులు, చేనేతలు నిలదీయాలని సూచించారు. తెలంగాణలో కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయమన్నారు.



ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన దుబ్బాక మండలం పద్మశాలిగడ్డకు గ్రామానికి చెందిన రెడ్డి సంఘం నాయకులు

## విశాఖ శ్రీశారదా పీఠంలో 'కెప్టెన్' కుటుంబ సభ్యుల పూజలు

- పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ ఆశీర్వచనాలు స్వీకరణ



శ్రీశారదా పీఠాధిపతుల ఆశీర్వాదం స్వీకరిస్తున్న కెప్టెన్ లక్ష్మీకాంతరావు, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్, అక్టోబర్ 17: విశాఖలోని శ్రీ శారదా పీఠంలో మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, సరోజినీదేవి, హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, డాక్టర్ షమిత దంపతులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి, ఉత్తర పీఠాధిపతి శ్రీస్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామిలను దర్శించుకొని వారి ఆశీర్వాదాలు స్వీకరించారు. అనంతరం శ్రీరాజశ్యామల అమ్మవారిని దర్శించుకొని శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఠాధిపతుల ఆశీర్వాదం పొందడం ఆనందంగా ఉన్నదన్నారు. తెలంగాణ ప్రజలతోపాటు హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రజలు సుభిక్షంగా, సుఖసంతోషాలతో ఉండాలని, పుష్కలంగా పంటలు పండి సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధిని సాధించాలన్నారు. సీఎం కేసీఆర్ వచ్చే ఎన్నికల్లో ఘన విజయం సాధించి హ్యాట్రిక్ ముఖ్యమంత్రి కావాలని శ్రీరాజశ్యామల అమ్మవారితోపాటు పీఠాధిపతులను కోరుకున్నట్లు చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గం కూడా గులాబీ జెండా నీడలో అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించాలని వేడుకున్నట్లు తెలిపారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- హుస్నాబాద్ మోడల్ స్కూల్‌లో స్ట్రాంగ్‌రూమ్ ఏర్పాటు
- జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్‌పాటిల్

హుస్నాబాద్, అక్టోబర్ 17: అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ సూచించారు. మంగళవారం హుస్నాబాద్‌లోని సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయ భవనాన్ని సందర్శించగా, ఆర్డీవో బెన్‌షాలోమ్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఐవోసీ భవనంలోని పలు కార్యాలయాలను పరిశీలించారు. కొన్ని కార్యాలయాలు ఇంకా షిఫ్ట్ కాకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తెలంగాణ మోడల్ స్కూల్‌ను సందర్శించి, ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించారు. ఈవీఎంలు రాగానే భద్రపర్చి నిత్యం విద్యుత్ ఉండేలా చూసుకోవాలన్నారు. ఈవీఎంల డిస్పాచింగ్, పోలింగ్ అనంతరం కౌంటింగ్ కేంద్రానికి వెళ్లే వరకు భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, ఎస్సై తోట మహేశ్ ఉన్నారు.



హుస్నాబాద్‌లోని మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్



సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావుకు ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న చర్లఅంకిరెడ్డిపల్లి ముదిరాజ్ సంఘ ప్రతినిధులు

## మంత్రి హరీశ్‌రావుకే మా మద్దతు

- చర్లఅంకిరెడ్డిపల్లి ముదిరాజ్‌ల ఏకగ్రీవ తీర్మానం
- సిద్దిపేటలో తీర్మానపత్రం మంత్రి హరీశ్‌రావుకు అందజేత

సిద్దిపేట కమాన్, అక్టోబర్ 17 : ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావుకే తమ మద్దతు అంటూ చిన్నకోడూరు మండలం చర్లఅంకిరెడ్డిపల్లి ముదిరాజ్‌లు ఏకగ్రీవ తీర్మానం చేశారు. మంగళవారం సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో మంత్రికి ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని ముదిరాజ్ సంఘు ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మీ ఆప్యాయత ఆదరణ గుండెల్లో పెట్టుకుంటానన్నారు. తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఇదంతా సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమైందన్నారు. జిల్లా సంగారెడ్డిలో ఉన్నప్పుడు ఎన్నో కష్టాలు పడ్డామన్నారు. ఇప్పుడు సిద్దిపేట జిల్లా అయ్యింది.. ఇక్కడ మెడికల్ కళాశాలతో పాటు 1000పడకల దవాఖాన వచ్చింది.. ఇటీవల సిద్దిపేటకు రైలు సైతం తెచ్చుకున్నామన్నారు. సిద్దిపేట గౌరవం, విలువ పెంచినం తప్పా తగ్గించలేదన్నారు. సిద్దిపేట అభివృద్ధిలో ప్రజల్లోనాకు గౌరవం పెరిగిందన్నారు. పెద్దవాగులో ఎండకాలం కూడా నీళ్లు ఉన్నాయంటే సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమైందన్నారు. సీఎం కేసీఆర్ రైతుల విలువ పెంచిండు.. రైతు విలువతోపాటు భూమి విలువ పెరిగిందన్నారు. 'ప్రతి నిమిషం ప్రజల కోసం కష్టపడుతా.. అన్నివర్గాలను సమానంగా ముందుకు తీసుకెళ్తున్నాం.. ఎవరికి కష్టమొచ్చిన నేనున్నా'..బీఆర్ఎస్‌లోకి మీ అందరినీ స్వాగతిస్తున్నానన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధిలో భాగస్వాములమవుదామన్నారు.

## 'తెలంగాణ గల్లుమందిరో' సీడీ ఆవిష్కరణ



కేసీఆర్ పాటల సీడీని ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

- అత్యధిక మెజార్టీతో కేసీఆర్‌ను గెలిపించాలి
- ప్రతి ఇంట్లో సంక్షేమ పథకాలను వివరించాలి
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు

గజ్వేల్, అక్టోబర్ 17 : 'తెలంగాణ గల్లుమందిరో.. పల్లె పల్లె కదులుతుందిరో ఓ అన్నా... మూడోసారి కేసీఆర్‌నే ముఖ్యమంత్రిగా గెలిపిద్దాం' 2023 పాటల సీడీని మంగళవారం సిద్దిపేటలో ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. రైతు బంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవీ రవీందర్, మర్కూక్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి రూపొందించిన కేసీఆర్ పాటల సీడీని ఆవిష్కరించిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. గజ్వేల్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన కేసీఆర్‌కు ప్రజలు మంచి మెజార్టీని కట్టబెట్టేలా ప్రతి కార్యకర్త ముందుండి నడవాలన్నారు. గజ్వేల్‌లో తొమ్మిదిన్నరేండ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. అన్నిరంగాల్లో గజ్వేల్ రూపురేఖలు మార్చిన కేసీఆర్‌కు లక్ష ఓట్ల మెజార్టీని బహుమతిగా అందించి రాబోయే ప్రభుత్వంలో మరింతగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ వెళ్లాయని అందరిని ఇందులో భాగస్వాములను చేయాలన్నారు. ప్రతి లబ్ధిదారుడిని కలిసి మనం అందించిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి పండరి రవీందర్‌రావు, మండల అధ్యక్షుడు బెండె మధు, ఆత్మ కమిటీ డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, లింగారెడ్డిపల్లి ఉపసర్పంచ్ తోట శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి పాల రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15–22 వేలు. ఏజెంట్లకు 5000/– కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-320501

★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం, జీతం–16k to 18k ఏజెంట్ కమిషన్ 6k, Ph: 9640468899, 9640258899.
NT-320252-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.